నేటి మ్యాచ్
బంగ్లాదేశ్ X శ్రీలంక
మ. 2.00 నుంచి
వేదిక: ఢిల్లీ

బర్త్‌డే బ్లాస్ట్

అష్టదిగ్బంధం

భారత్ ఎనిమిదో విజయం

అజేయ భారత్! వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు ఎదురనేదే లేకుండా పోయింది. పోటీనిస్తుందనుకున్న ఆస్ట్రేలియా తొలి పోరులోనే పలాయనం చిత్తగిస్తే.. దాయాది పాకిస్థాన్ మన ఆధిపత్యానికి దాసోహమైంది. కొరుకుడుపడని కొయ్యలా మారిన కివీస్‌ను దంచేసిన రోహిత్ సేన.. భీకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్న దక్షిణాఫ్రికాను గల్లీ జట్టు కన్నా హీనంగా ఓడించి మెగాటోర్నీలో ఎనిమిదో విజయం ఖాతాలో వేసుకుంది.

కింగ్ కోహ్లీ తన పుట్టిన రోజు నాడు యావత్ భారతావనికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చాడు. బొంగరం కన్నా ఎక్కువ స్పిన్ తిరుగుతున్న పిచ్‌పై మూడంకెల స్కోరుతో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ వన్డే సెంచరీలను సమం చేసి జట్టుకు భారీ స్కోరు అందిస్తే.. ఛేదనలో మన బౌలర్ల ధాటికి సఫారీలు కనీస ప్రతిఘటన లేకుండానే తోకముడిచారు! ఇదే జోరుతో మరో మూడు మ్యాచ్‌లు నెగ్గితే భారత్ ముచ్చటగా మూడోసారి జగజ్జేతగా నిలువడం ఖాయమే!!

243 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు

పుట్టిన రోజు కోహ్లీ అజేయ సెంచరీ

రవీంద్ర జడేజా పాంచ్ పటాకా

1
వన్డే క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు (49) చేసిన జాబితాలో సచిన్‌ను విరాట్ సమం చేశాడు. ఇందుకు టెండూల్కర్‌కు 452 ఇన్నింగ్స్‌లు అవసరమైతే.. కోహ్లీ 277 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్క్ అందుకున్నాడు.

కోహ్లీ (101*)

7
పుట్టిన రోజు నాడు వన్డే శతకం సాధించిన ఏడో ఆటగాడిగా విరాట్ రికార్డుల్లోకెక్కాడు. కాంబ్లీ, సచిన్, జయసూర్య, టేలర్, లాథమ్, మిషెల్ మార్ష్ కూడా ఈ అరుదైన ఫీట్ సాధించారు.

118
విరాట్ వీరంగమాడుతున్న సమయంలో ఈడెన్ గార్డెన్స్‌లో నమోదైన శబ్దం డెసిబుల్స్‌లో.

జడేజా (5/33)

కోల్‌కతా: స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ వరుసగా ఎనిమిదో విజయం ఖాతాలో వేసుకుంది. కష్టతరమైన పిచ్‌పై బ్యాటర్ల మొక్కవోని దీక్షకు.. బౌలర్ల సహకారం తోడవడంతో టీమ్‌ఇండియా అజేయంగా నిలిచింది. ఆదివారం కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన పోరులో రోహిత్ సేన 243 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. తన 35వ పుట్టినరోజు నాడు బర్త్‌డే బాయ్ విరాట్ కోహ్లీ (121 బంతుల్లో 101 నాటౌట్; 10 ఫోర్లు) సూపర్ సెంచరీతో కదంతొక్కితే.. శ్రేయస్ అయ్యర్ (77; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) అతడికి అండగా నిలిచాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (24 బంతుల్లో 40; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా.. రవీంద్ర జడేజా (15 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, ఒక సిక్సర్) అద్భుత ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంగిడి, జాన్సెన్, రబడ, కేశవ్ మహరాజ్, షంసీ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌటైంది. నలుగురు మాత్రమే రెండంకెల స్కోరు చేయగా.. ఒక్కరు కూడా 15 పరుగుల మార్క్ దాటలేకపోయారు. వరల్డ్ కప్‌లో సెంచరీల మోత మోగిస్తున్న డికాక్ (5), బవుమా (11), డసెన్ (13), మార్క్‌రమ్ (9), క్లాసెన్ (1), మిల్లర్ (11), జాన్సెన్ (14) ఇలా ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 5 వికెట్లు పడగొడితే.. మహమ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. రికార్డు సెంచరీ బాదిన కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. టీమ్‌ఇండియా తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆదివారం నెదర్లాండ్స్‌తో తలపడనుంది.

> అద్భుతంగా ఆడావు విరాట్ శుభాకాంక్షలు. నేను ఈ ఏడాది 49 నుంచి 50లోకి అడుగు పెట్టడానికి 365 రోజులు పట్టింది. నువ్వు త్వరలోనే నా రికార్డు బద్దలు కొట్టి వన్డేల్లో 50వ సెంచరీ పూర్తి చేసుకుంటావని ఆశిస్తున్నా.
>
> -సచిన్ టెండూల్కర్

1 వన్డేల్లో దక్షిణాఫ్రికాకు పరుగుల పరంగా ఇదే (243) అతిపెద్ద పరాజయం. వన్డేల్లో వాళ్లకిది (83) రెండో అత్యల్ప స్కోరు.

2 వన్డే ప్రపంచకప్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన భారత రెండో స్పిన్నర్‌గా జడేజా నిలిచాడు. యువరాజ్ ముందున్నాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 326/5 (కోహ్లీ 101 నాటౌట్, శ్రేయస్ 77; కేశవ్ 1/30), దక్షిణాఫ్రికా: 27.1 ఓవర్లలో 83 ఆలౌట్ (జాన్సెన్ 14; జడేజా 5/33, కుల్దీప్ 2/7).

ఏమని వర్ణించను..

పుష్కర కాలం క్రితం స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించిన అనంతరం.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను భుజాలమీద ఎత్తుకొని తిరిగిన ఆ పాల బుగ్గల పసివాడు.. పన్నెండేండ్లు తిరిగేసరికి మాస్టర్ బ్లాస్టర్ సరసన చేరాడు. వన్డే ఫార్మాట్‌లో సచిన్ నెలకొల్పిన 49 శతకాల రికార్డును తిరగరాయడం అసాధ్యం అనుకుంటే.. దాన్ని అవలీలగా సుసాధ్యం చేసి చూపాడు. గాడ్ ఆఫ్ క్రికెట్‌కు ఈ మార్క్ చేరేందుకు 451 ఇన్నింగ్స్‌లు అవసరమైతే.. కేవలం 277 ఇన్నింగ్స్‌ల్లోనే అతడు దాన్ని అందుకున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లోనే తొలి వన్డే సెంచరీ నమోదు చేసుకున్న ఆ ఆధునిక క్రికెట్ దేవుడు.. పుట్టినరోజు నాడు తన గురువు రికార్డును సమం చేసి శభాష్ అనిపించుకున్నాడు. మనం ఇంతసేపు చెప్పుకున్నది విరాట్ కోహ్లీ గురించే! టెండూల్కర్ ఆడిన చివరి వన్డేలో పాకిస్థాన్‌పై హాఫ్ సెంచరీతో సరిపెట్టుకుంటే.. అదే పోరులో మాస్టర్ ఘనతలను ముందుకు తీసుకెళ్లడానికి నేనొస్తున్నాను అని దాయాది బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ 183 పరుగులు చేసిన విరాట్ ఆటతీరును ప్రశంసించేందుకు మాటలు కరువయ్యే పరిస్థితి తీసుకొచ్చాడు! ఏమని చెప్పగలం అతడి గురించి.. ఎంతని చెప్పగలం.. అంతర్జాతీయ క్రికెట్‌పై చెరగని ముద్ర వేసుకున్న కోహ్లీ గురించి రాస్తే రామాయణం.. చెప్తే మహాభారతమే అవుతుంది!

నీ దెబ్బతో కెరీర్‌కు చరమగీతం పాడిన ప్రత్యర్థి బౌలర్లను
అడిగితే తెలుస్తుందేమో నీ గొప్పతనం ఏంటో!
నీ దెబ్బకు పదే పదే బౌండ్రీ తాడును ముద్దాడే బంతిని
అడిగితే చెబుతుందేమో మా కన్నా మిన్నగా!
నువ్వు కొట్టిన బౌండ్రీలకు, సిక్సర్లకు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచిన
అంపైర్లను అడిగితే తెలుస్తుందేమో.. నీ కవర్ డ్రైవ్ కళాత్మకత ఏంటో!
నాన్ స్ట్రయికింగ్ ఎండ్ నుంచి చూసిన సహచర ఆటగాళ్లను
అడిగితే మరింత బాగా వర్ణిస్తారేమో ఆ విరాట పర్వాన్ని..!
నీ కెరీర్ ప్రారంభమైనప్పటి నుంచి స్కోరర్‌లుగా కొనసాగుతున్న
వాళ్లను అడిగితే తెలుస్తుందేమో.. నీ అంకెల గారడీ ఎంత గొప్పదో!
బౌండ్రీ బయట కూర్చున్న బాల్ బాయ్స్‌ను అడిగితే
తెలుస్తుందేమో నీ స్ట్రయిట్ డ్రైవ్‌లో ఉన్న వేగమెంతో!
సచిన్ రిటైర్మెంట్ తర్వాత క్రికెట్ చూడటమే మానేసి..
ఆ తర్వాత నీ వీరత్వానికి గులామైన కోట్లాది మంది
వీరాభిమానులను అడిగితే బాగా చెప్తారేమో!
వేనోళ్ల పొగిడినా తనివి తీరని
నీ అద్భుత ఆటతీరును ఏమని వర్ణించగలం!!

విరాట్ స్వింగ్‌లో ఉంటే.. రిపోర్టర్లు గణాంకాలు కాకుండా నిఘంటువులు తెరిచి విశేషణాలు వెతుక్కోవాలని రవిశాస్త్రి చెప్పిన మాట అక్షర సత్యం. ఎవరైనా ఊహించారా.. అసలు కలలోనైనా కలగన్నారా.. సచిన్ వన్డే సెంచరీల రికార్డుకు దరిదాపుల్లోకి ఎవరైనా వస్తారని.. కానీ మాస్టర్ మాత్రం ముందే ఊహించాడు. తన రికార్డులను తిరగరాసే సత్తా విరాట్‌లో ఉందని ఆనాడే వెల్లడిస్తే.. ఈ రోజు కోహ్లీ దాన్ని చేతల్లో చూపాడు. వ్యక్తిగత మైలురాళ్ల కోసమే ఆడుతాడు.. సెంచరీలే అతడికి ముఖ్యం అనేవాళ్లకు దక్షిణాఫ్రికాతో మ్యాచ్ చక్కటి ఉదాహరణ. మెగాటోర్నీలో మంచినీళ్ల ప్రాయంలా భారీ స్కోర్లు చేస్తున్న సఫారీ ప్లేయర్లు 83 పరుగులకే ఆలౌటైన చోట.. విరాట్ తన విలువ చాటుకున్నాడు. ఆఫ్‌స్టంప్ అవతల పడ్డ బంతి అనూహ్యంగా టర్న్ అయి లెగ్‌సైడ్ వైడ్‌గా వెళ్తున్న పిచ్‌పై బాల్‌ను టచ్ చేయడం కూడా కష్టమే అనిపించిన తరుణంలో అతడి తెగువను ఎంత పొగిడినా తక్కువే! మొత్తం ఇన్నింగ్స్‌లో మచ్చుకైనా ఒక్క లూజ్ షాట్ ఆడకుండా.. వంద పరుగుల మార్క్ దాటిన విరాట్ నీకు వందనం! ఇదే జోష్‌లో కోహ్లీ ప్రపంచకప్ ముద్దాడితే చూడాలని 140 కోట్ల మంది భారతీయులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు!

– నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

రష్మికకు రజతం

గోవా: నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక రజత పతకంతో సత్తాచాటింది. గోవా వేదికగా జరుగుతున్న 37వ జాతీయ క్రీడల మహిళల సింగిల్స్ ఫైనల్లో రష్మిక పరాజయం పాలైంది. ఆదివారం జరిగిన తుది పోరులో రష్మిక 5-7, 6-7 (3/7)తో వైదేహీ చౌదరి (గుజరాత్) చేతిలో ఓడింది. ఇప్పటికే మహిళల డబుల్స్‌లో రజత పతకం సాధించిన రష్మిక.. ఇప్పుడు వ్యక్తిగత విభాగంలోనూ వెండి వెలుగులు విరజిమ్మింది. ఇక టీమ్ విభాగంలో తెలంగాణ మహిళల జట్టు కాంస్య పతకం నెగ్గడంలోనూ రష్మిక కీలక పాత్ర పోషించింది.

పారా ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ అథ్లెట్ దీప్తికి ఆదివారం ఏజియస్ ఫెడరల్ ప్రతినిధులు జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ చేతులు మీదుగా లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందించారు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	8	8	0	+2.45	16
దక్షిణాఫ్రికా ✓	8	6	2	+1.37	12
ఆస్ట్రేలియా	7	5	2	+0.92	10
న్యూజిలాండ్	8	4	4	+0.39	8
పాకిస్థాన్	8	4	4	+0.03	8
అఫ్గానిస్థాన్	7	4	3	-0.33	8
శ్రీలంక	7	2	5	-1.16	4
నెదర్లాండ్స్	7	2	5	-1.39	4
బంగ్లాదేశ్ X	7	1	6	-1.44	2
ఇంగ్లండ్ X	7	1	6	-1.50	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

72198 21111 | BAJAJ FINANCE LTD - AF | BAJAJ SECURE

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.